సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 21 । ఏప్రిల్ । 2024

ఉప్పొంగిన జనాభిమానం ముందు...మండు వేసవి చిన్నబోయింది. నిప్పులు కురిపిస్తున్న సూరీడును లెక్కచేయక వేలాది జనం తమ ప్రియతమ నేతను చూసేందుకు తరలిరావడంతో జాతీయ రహదారి జనసంద్రమైంది. దారిపొడవునా సీఎం జగన్ సిద్ధం బస్సు యాత్రకు జనం నీరాజనం పట్టారు. హారతులిచ్చి దీవెనలు అందించారు. ఆయనతో కరచాలనానికి, సెల్ఫీల కోసం పోటీపడ్డారు. తన రాక కోసం మండుటెండలో ఎదురు చూసిన అభిమానజనానికి జగనన్న చేతులెత్తి అభివాదం చేశారు. బస్సు దిగి అక్కచెల్లెమ్మలను, అవ్వాతాతలను ఆత్మీయంగా పలకరించారు. ఆపన్నులను అక్కున చేర్చుకున్నారు. వినతులు తీసుకుని నేనున్నానంటూ భరోసా ఇచ్చారు. మరోవైపు సీఎం బస్సు యాత్ర జైత్రయాత్రలా సాగింది...వైఎస్సార్‌ సీపీ శ్రేణుల్లో జోష్ నింపింది. సార్వత్రిక సమరానికి సన్నద్ధుల్ని చేసింది..

ఆత్మీయ నేతకు నీరా'జనం' : కశింకోట మండలం చింతలపాలెంలో మేమంతా సిద్ధం... సభకు తరలివచ్చిన అశేష జనవాహిని. అభివాదం చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి









నేనున్నా...నేను విన్నా.. : బస్సు యాత్రలో వైద్యసహాయం కోసం వినతులు అందించిన ఆపన్నులకు భరోసా ఇస్తున్న సీఎం జగన్

- జైత్రయాత్రకు సిద్ధం

నీ రాకే.. జగన్మోహనం

- సీఎం మేమంతా సిద్ధం యాత్రకు జిల్లాలో బ్రహ్మరథం
- వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ఫుల్ జోష్
- మండుటెండనూ లెక్కచేయని అభిమాన జనం
- చింతలపాలెం బహిరంగ సభకు పోటెత్తిన జనసందోహం
- దారిపొడవునా హారతులు
- గుమ్మడి కాయలతో దిష్టి తీసి దీవెనలు

సాక్షి, అనకాపల్లి :

వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనకాపల్లి జిల్లాలో నిర్వహించిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో ఫుల్ జోష్ నింపింది. ఒకవైపు నోటిఫికేషన్ వెలువడి మంచి రోజులు, ముహూర్తాలు చూసుకుని పార్టీ అభ్యర్థులు అట్టహాసంగా నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. ఈ తరుణంలో పార్టీ అధ్యక్షుడిగా సీఎం జగన్ మండుటెండను. సైతం లెక్క చేయకుండా..పగలనక, రాత్రనక నిర్వహించిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రకు దారి పొడవునా ప్రజాభిమానం ఉప్పొంగింది.

70 కిలోమీటర్ల బస్సు యాత్ర

మేమంతా సిద్ధం బస్సు యాత్ర 19వ రోజు అనకాపల్లి జిల్లాలో 70 కిలోమీటర్ల మేర సాగింది. జిల్లాలో మూడు నియోకవర్గాల పరిధిలో 21 గ్రామాల మీదుగా జరిగిన బస్సు యాత్రకు ప్రజలు నిరాజనాలు పలికారు. ఉదయం 10.30 గంటలకు పాయకరావుపేట నియోజకవర్గం గొడిచెర్లలో ప్రారంభమైన బస్సుయాత్ర.. ఉద్దండపురం, కాగిత, సీతం పాలెం, నక్కపల్లి, పులపర్తి, రేగుపాలెం, యలమంచిలి బైపాస్ మీదుగా మధ్యాహ్నం 1.10 గంటలకు అచ్యుతాపురంలో గల లంచ్ పాయింట్ చేరుకుంది. అనంతరం తాళ్లపాలెం సమీపంలో చింతలపాలెం వద్ద గల బహిరంగ సభకు 4.30 గంటల చేరుకున్నారు. సీఎం ప్రసంగం 4.50కి ప్రారంభమై 5.40 వరకు సాగింది.

ఒక్కో మాట తూటాలా..

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగం ఆద్యంతం ప్రజలను ఉర్రూతలూగించింది. ఆయన ఒక్కో మాట తూటాలా పేలింది. ఒకవైపు చంద్రబాబు చేస్తున్న కుట్రలు, బూటకపు వాగ్దానాలను చీల్చి చెండాడుతూనే.. మరోవైపు వైఎస్సార్ ప్రభుత్వంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు గుర్తు చేశారు. సుమారు 50 నిమిషాల పాటు ప్రసంగం అనంతరం ఆయన సభా ప్రాంగణం నుంచి బయలుదేరి తాళ్ళపాలెం జంక్షన్, జమాదులపాలెం క్రాస్, బుచ్చియ్యపేట, కశింకోట, కొత్తూరు, అనకాపల్లి, శంకరం, రేబాక మీదుగా యాత్ర సాగింది. రాత్రి 7.15 గంటలకు పెందుర్తి నియోజకవర్గం చిన్నయ్యపాలెం వద్ద సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్ యాత్ర ముగిసింది.



వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీఎం జగన్

అడ్డురోడ్డులో గుమ్మడికాయలతో దిష్టి..

సీఎం జగన్‌ను కనులారా చూసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రతి జంక్షన్‌లోను హారతులు ఇచ్చి పూల వర్షం కురిపించారు. అడ్డురోడ్డు జంక్షన్‌లో ముఖ్యమంత్రి జగన్‌కు ఘనస్వాగతం పలుకుతూ మహిళలు గుమ్మడికాయలతో దిష్టితీశారు. మళ్లీ మీరే సీఎం అంటూ నినాదాలు చేస్తూ హారతులు పట్టారు.

సభకు పోటెత్తిన జనం..

కశింకోట మండలం చింతలపాలెం జాతీయ రహదారి వద్ద సాయంత్రం నిర్వహించిన బహిరంగ సభ భారీ జనసందోహంతో దద్దరిల్లి పోయింది. పెద్ద ఎత్తున వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు సభకు పోటెత్తారు. భగభగమంటూ నిప్పులు చెరిగిన సూర్యుడు సైతం.. సభకు హాజరైన జన సందోహాన్ని చూసి చల్లబడ్డాడు. వేలాది మంది వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానుల కేరింతలు.. విజిల్స్‌తో సభ హోరెత్తింది. జగనన్న ప్రసంగానికి ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది.



అదిగో జగనన్న : సీఎం జగన్‌కు మహిళల అభివాదం

అన్నా.. నిన్ను మళ్లీ సీఎంగా చేసుకునేందుకు మేమంతా సిద్ధం అంటూ ప్లకార్డులు చూపిస్తూ నినాదాలు చేశారు. చంద్రబాబు వద్దు.. జగనన్నే ముద్దు అంటూ నినాదాలు చేశారు. ఎన్నికలకు సిద్ధమా..? అని సీఎం వైఎస్ జగన్ పిలుపునిచ్చిన వెంటనే తమ మొబైల్ ఫోన్‌లో లైట్ వేసి మేమంతా సిద్ధం అని సభలో ఉన్న జనసందోహమంతా నినదించారు.

టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరికలు..

పాయకరావుపేట నియోజకవర్గం గొడిచెర్ల క్యాంప్ దగ్గర శనివారం ఉదయం టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరికలు జరిగాయి. నర్సీపట్నం నియోజకవర్గం మాకవరపంపాలేనికి చెందిన టీడీపీ సీనియర్ నేత రుత్తల ఎర్రాపాత్రుడు, రాష్ట్ర టీడీపీ యూత్ విభాగం నేత ఆడారి కిషోర్, పాపయ్యపాలేనికి చెందిన టీడీపీ సీనియర్ మహిళానేత వి.లక్ష్మి, ఎస్.రాయవరం మండలం కొన్నావానిపాలేనికి చెందిన కోర్ని బాబ్జీ వైఎస్సార్‌సీపీలో చేరారు. అదేవిధంగా కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన జనసేన సీనియర్ నేత, ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రెసిడెంట్ డీఎంఆర్ శేఖర్, దుర్గాభవానీ వైఎస్సార్‌సీపీలోకి చేరారు. పాయకరావుపేట గొడిచెర్ల వద్ద సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థులు కరణం ధర్మశ్రీ, పెట్ల ఉమాశంకర్ గణేష్, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, మలసాల భరత్‌కుమార్, యు.వి.రమణమూర్తిరాజు(కన్నబాబురాజు), కంబాల జోగులు, ఈర్లె అనురాధ, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, శాసనమండలి విప్ వరుదు కళ్యాణి, ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, జిల్లా పార్టీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దిలీప్‌కుమార్, ఎన్నికల పరిశీలకులు బొడ్డేడ కాశీవిశ్వనాథం, రొంగలి జగన్నాథం, శరగడం చినఅప్పలనాయుడు, చిక్కాల రామారావు, సినీనటుడు జోగినాయుడు, ఎంఎస్ఎంఈ చైర్మన్ సూర్యనారాయణ రాజు, ముఖ్యనాయకులు వీసం రామకృష్ణ, చింతకాయల సన్యాసిపాత్రుడు, డాక్టర్ లక్ష్మీకాంత్, దాడిశెట్టి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకటరావు పాల్గొన్నారు.

అక్కా చెల్లెమ్మలకు ఆత్మీయ పలకరింపు..

జిల్లాలో పాయకరావుపేట, యలమంచిలి, అనకాపల్లి నియోజకవర్గాల్లో దారి పొడవునా జగన్‌ను చూసేందుకు ఎండను సైతం లెక్క చేయకుండా మహిళలు, వృద్ధులు వేచి ఉన్నారు. అలాగే సీఎం జగన్ కూడా జాతీయ రహదారిపై ఉన్న గ్రామాలు, జంక్షన్‌ల వద్ద బస్సు ఆపి మహిళలు, వృద్ధులను ఆత్మీయంగా పలకరించారు. మధ్యలో కొంత మంది పలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకురాగా.. వాటిని వెంటనే పరిష్కరిస్తానని భరోసా ఇవ్వడంతో పాటు అక్కడికక్కడే తగిన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి జంక్షన్‌లోను సీఎం జగన్ బస్సు యాత్రతో పెద్ద ఎత్తున యువత వాహనాలు జత కలవడంతో జాతీయ రహదారి జనసంద్రంగా మారిపోయింది.



అన్నా మేమంతా నీ వెంటే : అక్కచెల్లెమ్మల ఉత్సాహం



మీ చల్లని దీవెనలు కావాలి : యాత్రలో తనకు జేజేలు పలుకుతున్న వృద్ధులను ఆత్మీయంగా పలకరిస్తున్న సీఎం జగన్



అపూర్వ స్వాగతం : బస్సు యాత్రకు వేలాదిగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు

కొనసాగుతున్న నామినేషన్ల పర్వం

- అరకు పార్లమెంట్‌కు ఒకటి
- పాడేరు, అరకు, రంపచోడవరం అసెంబ్లీకి నాలుగు దాఖలు

8లో



రంపచోడవరం అసెంబ్లీ ఆర్‌వోకు నామినేషన్ అందజేస్తున్న పల్లాల లచ్చిరెడ్డి

టీడీపీ రెబల్ అభ్యర్థిగా పోటీచేస్తా

మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి

రంపచోడవరం: టీడీపీ రెబల్ అభ్యర్థిగా రంపచోడవరం అసెంబ్లీకి బరిలో నిలుస్తానని ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి స్పష్టం చేశారు. శనివారం ఇక్కడ నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఐదేళ్ల పాటు పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎంతో కష్టపడి పనిచేశానని తెలిపారు. తనను కాదని నియోజకవర్గ ప్రజలకు ఎవరో తెలియని మిరియాల శిరీషదేవికి పార్టీ టికెట్ ఇవ్వడం బాధ కలిగించిందన్నారు. అధిష్ఠానం తీసుకున్న ఈ నిర్ణయం పార్టీ నేతలు, కార్యకర్తల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఉందన్నారు. టీడీపీ జెండాతో ప్రచారం చేసి, రెబల్ అభ్యర్థిగా బరిలో నిలుస్తానన్నారు. కార్యకర్తలు, నాయకులతో మాట్లాడి నామినేషన్ వేసే తేదీని ప్రకటిస్తానని ఆమె తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న వంతల రాజేశ్వరి



సముద్రంలో కాల్పులు జరుపుతున్న భారత నావికాదళానికి చెందిన నౌక

తూర్పు తీరంలో పూర్వ లెహర్ నిర్వహణ

సింధియా: తూర్పు నావికాదళ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ ఆధ్వర్యంలో ఆపరేషన్ కంట్రోల్‌లో భాగంగా తూర్పు తీరంలో సముద్ర సవాళ్లను ఎదుర్కొనేందుకు భారత నావికాదళ సంసిద్ధతను ధ్రువీకరించడమే లక్ష్యంగా పూర్వ లెహర్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ వ్యాయామంలో పలు నౌకలు, జలాంతర్గాములు, విమానాలు, ప్రత్యేక దళాలు ఉత్సాహంగా పాల్గొన్నాయి. వ్యూహాత్మక దశలోవాస్తవికంగా పోరాట శిక్షణతో పాటు భారత నావికాదళం ఆయుధాలను అందించగల సామర్థ్యాన్ని పునరుద్ఘాటిస్తూ పలు దశల్లో వివిధ కాల్పులను విజయవంతంగా నిర్వహించారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న నామినేషన్ల పర్వం

సాక్షి,పాడేరు: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా శనివారం మూడో రోజు నామినేషన్ల పర్వం కొనసాగింది. అరకు పార్లమెంట్ స్థానానికి మూడవ రోజు శనివారం స్వతంత్ర అభ్యర్థి పాలక రంజిత్ కుమార్ అరకు పార్లమెంట్ ఆర్వో అధికారి నిషాంత్‌కుమార్‌కు అందజేశారు. దీంతో ఇప్పటికి మొత్తం ఐదు నామిషన్లు దాఖలు అయ్యాయి. పాడేరు అసెంబ్లీకి ఇండియా ప్రజాబంధు పార్టీ అభ్యర్థిగా కింటుకురి జోషఫ్ నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి భావన విశిష్టకు అందజేశారు.
పాడేరు : అరకు అసెంబ్లీ స్థానానికి శనివారం గొండ్వాన దండకారణ్య పార్టీ నుంచి చుంచు రాజాబాబు, ఇండిపెండెంట్ అభ్యర్థిగా గెమ్మెలి కృష్ణారావు ఆర్వో, పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ నామినేషన్ పత్రాలను అందజేశారు. ఆదివారం సెలవు కావడంతో సోమవారం నుంచి నామినేషన్లు స్వీకరిస్తామని ఆయన పేర్కొన్నారు.
రంపచోడవరం: రంపచోడవరం అసెంబ్లీకి మూడవ రోజు బూసిగూడెం పంచాయతీ కొత్త పాకలు గ్రామానికి చెందిన పల్లాల లచ్చిరెడ్డి నామినేషన్ సమర్పించినట్టు ఆర్వో ఎస్.ప్రశాంత్‌కుమార్ తెలిపారు.

'నల్లరాయి క్వారీని నిలిపివేయాలి'

జి.మాడుగుల: జిల్లాలోని హుకుంపేట మండలం కొట్నాపల్లి నల్లరాయి క్వారీని తక్షణమే నిలిపివేయాలని సీపీఐ మావోయిస్టు విశాఖ–అల్లూరి–అనకాపల్లి డివిజన్ కమిటీ కార్యదర్శి అరుణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆమె ఓ లేఖలో విజ్ఞప్తి చేశారు.

24 మందిపై బైండోవర్


బైండోవర్ చేస్తున్న తహసీల్దార్ రామకృష్ణ, ఎస్‌ఈబీ సీఐ రాజు

చింతపల్లి రూరల్: మండలంలో నాటు సారా తయారీ, విక్రయదారులపై బైండోవర్ నమోదు చేసినట్టు స్థానిక ఎస్‌ఈబీ సీఐ రాజు తెలిపారు. మండలంలో నాటు సారా తయారీ,విక్రయదారులు 24 మందిపై గతంలో కేసులు నమోదయ్యాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వారిని బైండోవర్ చేసినట్టు వారు తెలిపారు.

పాడేరు టీడీపీలో వర్గపోరు

- చంద్రబాబు జన్మదిన వేడుకల్లో బట్టబయలు

పాడేరు : చంద్రబాబు జన్మదిన వేడుకలు టీడీపీలో వర్గపోరుకు వేదికగా మారాయి. పాడేరులో ఆ పార్టీ శ్రేణులు రెండు వర్గాలుగా విడిపోయాయి. టీడీపీ అభ్యర్థి కిల్లు వెంకట రమేష్ నాయుడు ఆ పార్టీ సీనియర్లు, కూటమి పార్టీల నేతలతో కలిసి నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి గిడ్డి ఈశ్వరి వేరుగా నిర్వహించారు. దీంతో పార్టీ శ్రేణులంతా ఎవరి వెంట నడవాలో తెలియక దూరంగా ఉన్నారు.

ఘనంగా బడ్డు సంబరం


పాత పాడేరులో బడ్డు తాడుకు పూజలు చేస్తున్న స్థానికులు


బడ్డు తాడును ఇరువైపులా లాగుతున్న అన్నదమ్ములు, బావమరుదులు

అన్నదమ్ములే విజేతలు

సాక్షి,పాడేరు: గిరిజనుల సంప్రదాయ ఇటుకల పండగలో భాగంగా పాతపాడేరులో శనివారం బడ్డు సంబరం ఘనంగా జరిగింది. అటవీ ప్రాంతంలో సేకరించిన బడ్డు తాడును గ్రామ చావిడిలో ఏర్పాటు చేసి గిరిజన పూజారులు, గ్రామపెద్దలు ప్రత్యేక పూజలు చేశారు. వరసకు అన్నదమ్ములైన గిరిజనులు ఒకవైపు, బావమరుదులైన గిరిజనులు మరో వైపు బడ్డు తాడును పోటాపోటీగా లాగారు. అన్నదమ్ములే విజేతలుగా నిలిచారు. ఆదివారం గిరిజన మహిళల ఆధ్వర్యంలో బడ్డుతాడు సంబరం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

అభ్యర్థుల ఎన్నికల ఖర్చును కచ్చితంగా లెక్కించాలి

జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు పంకజ్‌సింగ్



సాక్షి,పాడేరు: జిల్లాలోని మూడు అసెంబ్లీ స్థానాల్లో పోటీచేసే అభ్యర్థుల ఎన్నికల ఖర్చులను కచ్చితంగా లెక్కించాలని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు పంకజ్‌సింగ్ ఆదేశించారు.శనివారం కలెక్టరేట్‌లో ఎన్నికల వ్యయ పరిశీలన, ఎస్ఎస్టీ, వీడియో గ్రాఫర్లు, ఇతర బృందాల సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోటీలో ఉండే అభ్యర్థులు ఖర్చు పెట్టే ప్రతి పైసాను లెక్కించాలని, షాడో రిజిస్టర్లు నిర్వహించాలని ఆయన సూచించారు. పెయిడ్ న్యూస్ వివరాలను బి–16ద్వారా ఎంసీఎంసీ తెలియజేస్తుందని, వాటిని కూడా అభ్యర్థుల ఖర్చులో లెక్కించాలని సూచించారు. అనుమతులు లేకుండా సభలు,సమావేశాలు,ర్యాలీలు నిర్వహిస్తే వాటిని పరిశీలించి ఎన్నికల వ్యయంలోకి తీసుకోవాలన్నారు.స్టార్ క్యాంపెయనర్లతో నిర్వహించే ఎన్నికల వ్యయాన్ని అభ్యర్థుల ఖాతాలకు సమానంగా చూపాలన్నారు, అభ్యర్థులు, పార్టీల ఖర్చులకు సంబంధించిన అంశాలపై 9381134602, 9381126301 నంబర్లకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ సమావేశంలో వ్యయ పరిశీలన నోడల్ అధికారి సువర్ణఫణి, ఎంసీఎంసీ సభ్యులు పి.గోవిందరాజులు, పి.రాములు పాల్గొన్నారు.

ఓటర్లను ప్రభావితం చేస్తే చర్యలు

- ఎన్నికల ఫిర్యాదులకు హెల్ప్‌లైన్
- కలెక్టర్ విజయ సునీత



సాక్షి,పాడేరు: సాధారణ ఎన్నికలలో ఓటర్లను ప్రభావితం చేస్తే చర్యలు తప్పవని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.విజయ సునీత హెచ్చరించారు.ఈ మేరకు శనివారం ఆమె ప్రకటన విడుదల చేశారు. ఓటర్లను డబ్బు, మద్యం, ఉచితాలతో ప్రలోభాలకు గురిచేసే వారిపై ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఇటువంటి వాటిపై కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన 08935–299912, 08935–299934, 08935–293448,1950 హెల్ప్‌లైన్ నంబర్లకు ఫిర్యాదు చేయాలన్నారు. ఆయా నంబర్లలో 24 గంటలు ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. ఎలాంటి అక్రమాలు తమ దృష్టికి వచ్చినా సంబంధించిన ఫొటోలు, వీడియోలను సీ–విజిల్ యాప్‌కు అప్‌లోడ్ చేయాలని సూచించారు. వీటిని 100 నిమిషాల్లో అధికారులు పరిష్కరిస్తారన్నారు. అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

ఎస్పీ తుహిన్ సిన్హా


అవగాహన కల్పిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

పాడేరు : అగ్ని ప్రమాదాలపై నిత్యం అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా సూచించారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాలు ముగింపు సందర్భంగా శనివారం స్థానిక అగ్నిమాపక కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన సిబ్బందికి అవగాహన కల్పించారు. ఎక్కడైన అగ్ని ప్రమాదాలు సంభవించిన నిర్లక్ష్యం చేయకుండా స్థానికులు వెంటనే సమీపంలో ఉన్న అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వాలన్నారు. ఈలోగా తమవంతు బాధ్యతగా మంటలను అదుపులోకి తెచ్చేందుకు పౌరులు ప్రయత్నించాలని సూచించారు. వారం రోజుల పాటు అవగాహన కల్పించిన అగ్నిమాపక సిబ్బందిని ఆయన అభినందించారు. జిల్లా అగ్నిమాపక కేంద్రం అధికారి బి. లక్ష్మణ స్వామి, డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సాధన, పాడేరు ఫైర్ స్టేషన్ అధికారి కె. పెంటయ్యనాయుడు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఏకలవ్య ప్రవేశ పరీక్ష


పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన డీడీ అభూ సలీమ్

వై.రామవరం: రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలో శనివారం నిర్వహించిన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల 6,7,8,9 తరగతుల ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ఏకలవ్య కన్వీనర్ శ్రీపాద రామకృష్ణ తెలిపారు. రంపచోడవరం బాలికలు, బాలుర గురుకుల పాఠశాలలు, రాజఒమ్మంగి బాలికల గురుకుల పాఠశాల, చింతూరు ఏకలవ్య పాఠశాల, చింతూరు పీటీజీ బాలుర గురుకుల పాఠశాలల్లో పరీక్ష జరిగిందన్నారు. 6వ తరగతిలో 1844 సీట్లకు 1628 మంది, 7వ తరగతిలో 192 సీట్లకు 166 మంది, 8వ తరగతిలో 127 సీట్లకు 112 మంది, 9వ తరగతిలో 73 సీట్లకు 65 మంది పరీక్ష రాశారని ఆయన పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలను ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ అభూసలీమ్ సందర్శించారు.


జగనన్నకు అపూర్వ స్వాగతం


పండుటాకులతో ఆత్మీయ పలకరింపు

మేమంతా సిద్ధం దృశ్య మాలిక


జగనన్నను చూసేందుకు చంటిబిడ్డలతో..


సంక్షేమ సారథితో సెల్ఫీ తీసుకుంటూ..


జననేతకు జేజేలు..

వర్షంతో చల్లబడిన వాతావరణం

ప్రజలకు ఉపశమనం


అరకులోయ మండలం కొరగూడలో ఎగిరిపోయిన పాఠశాల పైకప్పు

సాక్షి,పాడేరు: కొద్దిరోజులుగా ఏజెన్సీలో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడింది. ఉదయం నుంచి పాడేరు పరిసరాల్లో మబ్బు వాతావరణం నెలకొంది. మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఈదురుగాలులతో వర్షం ప్రారంభమైంది. జి.మాడుగుల.పెదబయలు, హుకుంపేట, డుంబ్రిగుడ, అరకులోయ మండలాల్లో కూడా వర్షం కురిసింది.

కొరగూడలో ఎగిరిపడిన పాఠశాల పైకప్పు

అరకులోయ మండలం బస్కి పంచాయతీ కొరగూడలో శనివారం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. పాఠశాల పైకప్పు రేకులు ఎగిరిపడ్డాయి. ఒంటిపూట బడులు కావడంతో ఆ సమయంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు లేనందున పెద్ద ప్రమాదం తప్పింది. పాడేరు, జి.మాడుగుల మండలాల్లో విద్యుత్ సరఫరాకు కొంతసేపు అంతరాయం ఏర్పడింది. సిబ్బంది వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టారు. సరఫరాను పునరుద్ధరించారు. కాపుదశలో ఉన్న మామిడి తోటలకు కొంత మేర నష్టం జరిగింది.


పాడేరులో కురుస్తున్న భారీ వర్షం